మల్కాజిగిరిలో మూడో రోజు.. ఏడు నామినేషన్లు

- ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మూడవ రోజైన శనివారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ప్రజా వెలుగు పార్టీ నుంచి లోగరి రమేష్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బోయిన దుర్గాప్రసాద్ యాదవ్ నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పెండ్యాల సాయివరప్రసాద్, పెసరి కాయల పరీక్షిత్ రెడ్డి, కంటే సాయన్న నామినేషన్లు దాఖలు చేశారన్నారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్, డమ్మీ అభ్యర్థి ఈటల జమున తరఫున శనివారం మరో రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం

- నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



ఉద్యోగ విరమణ పొందిన తిరుపతిరెడ్డిని సత్కరిస్తూ..

కీసర: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉంటుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన తిరుపతిరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విలువతో కూడిన విద్యను బోధించి వారి ఉన్నతికి పాటుపడిన తిరుపతిరెడ్డి సేవలను కొనియాడారు. అంతకుముందు తిరుపతిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు



విద్యార్థులు అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మేడ్చల్‌రూరల్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ రెండవ స్థాయిలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొంపల్లి-4 శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు మంచి ఫలితాలతో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం ఏజీఎం వెంకటరమణ ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ చక్రధర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు జయపాల్‌రెడ్డి, సీతారాంరెడ్డి, డీన్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈటలను గెలిపించాలంటూ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని అంజయ్యనగర్ కాలనీతో పాటు పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించి చేసి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు సురేశ్, ఆంజనేయులు, కిషన్, రాంబాబు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- సీఆర్‌పీఎఫ్ స్కూల్‌లో వార్షిక అవార్డ్స్ డే



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ స్కూల్‌లో శనివారం వార్షిక అవార్డ్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీఆర్‌పీఎఫ్ డీఐజీపీ అనిల్ మింజు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా ముఖ్యమైందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మొబైల్స్‌కి దూరంగా ఉంటూ తల్లిదండ్రుల కోరిక మేరకు ఉపాధ్యాయుల సలహాలతో ముందుకు నడవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ వెంకటరాజు, హెచ్‌ఎం ఆశాజీకుమార్, సీసీఏ కో-ఆర్డినేటర్స్ సభినాటి క్రోస్, నవనీత రాణి, ఆఫీస్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కిషోర్, రమణమూర్తి, ఈశ్వర్‌రావు, గోపాలకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మేడ్చల్: అత్వెల్లి గ్రామంలో నిరుపేద మహిళ అనారోగ్యంతో మరణించడంతో ఆమె అంత్యక్రియల కోసం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సాయాన్ని కుమారుడికి అందజేశారు.

ప్రభావిత వర్గాలే లక్ష్యం

- సామాజిక వర్గాలను తమ వైపు తిప్పుకునేందుకు పాట్లు
- పార్టీ విధానాలే ప్రచార అస్త్రాలుగా ముందుకెళ్తున్న పార్టీలు
- ఓటర్ల మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా కదుపుతున్న పావులు

లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల వ్యూహం



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రభావిత వర్గాలే లక్ష్యంగా ప్రచార వ్యూహాలు రచిస్తున్నారు. పెద్దసంఖ్యలో ఓటు బ్యాంకు కలిగిన సామాజిక వర్గాలను తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయా వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి హామీలు ఇస్తూ.. ప్రసన్నం చేసుకొనే దిశగా అడుగులు వేస్తున్నారు. కుల పెద్దలను కలుస్తూ.. ఎన్నికల్లో ఓట్లు తమ పార్టీకి వేసేలా సహకరించాలని కోరుతున్నారు. ఇందుకు ప్రతిగా.. సంబంధిత సామాజికవర్గాలకు అనుకూలంగా ఉండే హామీలను నేతలు ఇస్తున్నారు. ఆ సామాజిక వర్గంలోని వారిని సమన్వయం చేయాల్సిన బాధ్యతను కూడా పార్టీలోని అదే సామాజికవర్గ నేతలకు అప్పగిస్తూ.. ఎన్నికల కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రభావిత వర్గాలే లక్ష్యంగా..

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో బీసీలోని పలు సామాజిక వర్గాలను ముఖ్యంగా అత్యధికంగా ఉన్న వర్గాల ఓటర్లను ప్రభావితం చేసేలా.. ప్రధాన పార్టీల అభ్యర్థులు క్యాంపెయిన్ చేస్తున్నారు. ఎస్టీల్లో తండాలు, ఎస్సీల్లో మాదిగ సామాజికవర్గాల ఓట్ల విషయంలోనూ ప్రత్యేకంగా ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే ఆయా సామాజిక వర్గాలతో సమావేశాలు నిర్వహించడం ద్వారా తమ వైపునకు వారిని తిప్పుకొనే ప్రయత్నాలు మొదలయ్యాయి.

పార్టీ విధానాలే ప్రచార అస్త్రాలు..

- భారతీయ జనతా పార్టీ(బీజేపీ), కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలు తమ పార్టీ విధానాలు, కార్యక్రమాలే ప్రధానంగా ప్రచార అస్త్రాలుగా మలుచుకున్నారు.
- బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జాతీయ స్థాయిలో పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. అదే వేదిక నుంచి కాషాయ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. మోదీ హయాంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు, సామాజిక వర్గాల వారీగా బీజేపీ అభ్యర్థి ఈటల సమావేశాలు నిర్వహిస్తూ.. మద్దతు కూడగట్టుకుంటున్నారు.
- కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి వివిధ వర్గాలను కలవడంతో పాటు నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సమావేశమవుతున్నారు. యూపీఏ హయాంలో రైతులు, కార్మిక వర్గాల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాలతో పాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెబుతున్నారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాత్రం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో కలిసి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులతో సమావేశమవుతున్నారు. గడిచిన పదేళ్లలో అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేసి ఓట్లు పొందాలని చూస్తున్నారు. అవకాశం ఇస్తే పార్లమెంటులో ప్రజాగళం వినిపించడంతో పాటు అభివృద్ధి చేస్తానంటూ ప్రచారంలో ప్రజలకు వివరిస్తున్నారు.

ఎండ తీవ్రతతో..

మండుటెండల కారణంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు రాజకీయ పార్టీల సమావేశాల నిర్వహణ, ఎన్నికల ప్రచారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పార్టీ శ్రేణులను సమీకరించడం, సమన్వయం చేయడం ఒకఎత్తయితే.. వారిని క్షేత్ర స్థాయిలోకి దింపి ప్రచారంలో నిమగ్నమయ్యేలా చేయడం అభ్యర్థులకు కొంత ఇబ్బందిగానే మారుతోంది. ప్రస్తుతానికి పార్టీల కార్యకర్తలు, అభిమానులతో మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్నారు. వాతావరణం కాస్త అనుకూలంగా మారే నాటికి పార్టీ పెద్ద నాయకులతో ప్రచార కార్యక్రమాలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పోలింగ్ వరకు ఎండ ప్రభావం ఉంటుండటంతో.. ఉదయం, సాయంత్రం వేళలో ర్యాలీలు, సభలు నిర్వహించే అవకాశం మాత్రమే ఉంటుందని పార్టీల నాయకులు పేర్కొంటున్నారు.

ఘట్‌కేసర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



టోర్నమెంట్స్‌ను ప్రారంభిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ సీనియర్ నాయకుడు ముల్లి జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని గురుకుల్ కళాశాల ప్రాంగణంలో క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని టోర్నమెంట్స్‌ను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, చైర్మన్ ముల్లి పావని, బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి, కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు మామిండ్ల ముత్యాల్, మచ్చేందర్ రెడ్డి, సాయికిరణ్, చందు, ఉల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులు కష్టపడాలి



సమావేశంలో నేతలు

మేడ్చల్: ఎన్నికలకు మరో నెల రోజులు ఉండటంతో మేడ్చల్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా శ్రమించాలని బీజేపీ సీనియర్ నాయకుడు నారెడ్డి నందారెడ్డి అన్నారు. పట్టణంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త తమ బూత్ పరిధిలో ఉదయం, సాయంత్రం ప్రతి ఓటరును కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటు వేసేలా ప్రచారం చేయాలని సూచించారు. ప్రధాన నాయకులు ప్రచార శైలిని పర్యవేక్షించి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. నాయకులు ప్రతి ఓటరును కలిసే విధంగా ప్రచార వ్యూహాలను రచించి నెల రోజుల పాటు శ్రమించాలన్నారు. సమావేశంలో నాయకులు ఆంజనేయులు, మురళీధర్‌గుప్తా, ప్రేందాస్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రావు, నర్సింహారెడ్డి, శ్రీకాంత్, హేమలతరెడ్డి, వంశీధర్‌రెడ్డి, కానుకంటి వంశీ, ఈశ్వర్, సామిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్‌లో సోలార్ ప్లాంట్



పెనిస్ ఎనర్జీ కంపెనీ ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో రూ.26 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామని టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరిప్రసాదరావు అన్నారు. అందుకోసం పెనిస్ ఎనర్జీ కంపెనీ ప్రతినిధులకు 10 శాతం వ్యయాన్ని చెక్కు రూపంలో అందజేశామన్నారు. కంపెనీ ప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టౌన్‌షిప్‌లోని ఎస్టీపీకి కావాల్సిన కరెంట్ కోసం 54 కిలో వాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్ నిర్మిస్తున్నామన్నారు. ప్లాంట్ కోసం వెచ్చించిన రూ.26 లక్షల్లో రూ.9 లక్షలు ప్రభుత్వ నుంచి సబ్సిడీ రూపంలో అందుతుందని చెప్పారు. నీటి సరఫరా, ఎస్టీపీ నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.2.50 లక్షలు, లిఫ్టులతో పాటు లైట్ల కోసం నెలకు రూ.5 నుంచి 6 లక్షల విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, వీటిని సున్నా బిల్లుకు కుదించాలన్న లక్ష్యంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూడు నెలల వ్యవధిలో ప్రాజెక్టు పనులు పూర్తవుతాయన్నారు. అసోసియేషన్ సభ్యుడు అనునయ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కొనసాగుతోందన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్‌రావు





విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్‌రావు

మేడ్చల్‌రూరల్: ప్రతి ఇంజినీర్ దేశాభివృద్ధికి మూల కారకులు, ఇంజినీరింగ్ వ్యవస్థ లేకపోతే ఎలాంటి అభివృద్ధిని ఈ ప్రపంచం చూసేది కాదని హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్ రావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 13వ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ సాయంతో ప్రపంచాన్ని సైతం మనిషి ఒక్క టిక్‌తో నడిపిస్తున్నాడంటే అది ఇంజినీరింగ్ వ్యవస్థ గొప్పదనమే అన్నారు. ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసుకుని బయటి ప్రపంచంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు గొప్పగా ఎదిగి ప్రపంచానికి మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. అనంతరం జేఎన్‌టీయూహెచ్ ఎగ్జామినేషన్ డైరెక్టర్ అరుణ కుమారి మాట్లాడుతూ పట్టభద్రులైన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని జీవితంలో ఉన్నతస్థాయిలో నిలవాలని కోరారు. ఇంజినీరింగ్ గొప్పదనాన్ని సమాజానికి చాటిచెప్పేలా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్పొరేట్ రంగంలో నైపుణ్యత, సృజనాత్మకత ఉన్న విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతనం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారికి కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డీన్స్ వెంకట్రావు, రామసుబ్బారెడ్డి, శోభన్, శైలేంద్ర యాదవ్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు గౌడవెల్లిలో బోనాలు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ఆదివారం బోనాల పండగ నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి తెలిపారు. గ్రామ దేవత మైసమ్మ తల్లి బోనాలను గ్రామస్తులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. బోనాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు, గ్రామస్తులు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

హెచ్‌సీఏపై చర్యలు తీసుకోవాలి

ఉప్పల్: ఐపీఎల్ టికెట్ల జారీలో పారదర్శకత లేకుండా క్రీడాస్ఫూర్తిని దెబ్బతీస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్ రాష్ట్ర యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు హెచ్‌సీఏ తీరును నిరసిస్తూ ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఆవరణలో స్టేడియం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల ప్రతినిధులు వలిఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, కోటా రమేష్, సత్యప్రసాద్ మాట్లాడుతూ కనీసం అధికారులకు వినతి పత్రం అందజేసేందుకు కూడా అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, పేటీఎంలో పెట్టినట్లే పెట్టి విక్రయాలను నిలిపివేసి బ్లాక్ మార్కెట్‌లోకి తరలిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించడానికి అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తారని, అటువంటి ప్రజాదరణ ఉన్న క్రికెట్ ఆటను తిలకించే అవకాశం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. టికెట్ల విక్రయం అంశాలను పబ్లిక్ డొమైన్‌లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపడుతున్నట్లు పిలుపునిచ్చారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వార్డు సెక్షన్ అధికారి నారాయణకు అందజేశారు.

వాటర్ ప్లాంట్ మరమ్మతులకు ఆర్థిక సాయం



మరమ్మతులు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు

మేడ్చల్: నామమాత్రపు డబ్బులకు గ్రామస్తులకు శుద్ధి జలాన్ని అందించే వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గ్రామానికి చెందిన నలుగురు కలిసి నిధులు విరాళం అందజేసి మరమ్మతులు చేయించారు. మండలంలోని గౌడవెల్లి గ్రామంలో గతంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ తరఫున శుద్ధి చేసిన నీటిని గ్రామస్తులకు నామమాత్రపు రుసుముతో సరఫరా చేస్తున్నారు. ఇటీవల ప్లాంట్ మరమ్మతులకు రావడం, గ్రామ పంచాయతీలో నిధుల లేమి సమస్యతో గ్రామస్తులకు శుభ్రమైన నీరు అందక పేదలు ఇబ్బందులు పడ్డారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గోమారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు సింహల్‌యాదవ్ ఒక్కొక్కరు రూ.25 వేలు విరాళం ఇచ్చి రూ.లక్ష జమచేసి ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. గౌడవెల్లి గ్రామస్తులు వారిని అభినందించారు.

ఓటింగ్ పెంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు



సాక్షి, మేడ్చల్‌జిల్లా: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పరిధిలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందాల సహాయంతో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వీప్ సిబ్బంది సమన్వయంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కళాజాత బృందాలు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో స్వయం సహాయక సంఘాలు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ఓటింగ్ శాతం పెంపుపై వివిధ రూపాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించినట్లు స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు తెలిపారు. దండెపెల్లి శ్రీనివాస్ సాంస్కృతిక సారథి కళాజాత బృందాలు ఓటింగ్ శాతం పెంపు కోసం పలు కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలను చైతన్యపరిచినట్లు పేర్కొన్నారు.

'ది ఎస్ కోడ్' పుస్తకావిష్కరణ



'ది ఎస్ కోడ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ సీఈఓ నీలిమ

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ఆంగ్ల భాషా విభాగం ఎల్‌టై చాప్టర్ ఆధ్వర్యంలో ప్రణీత్ తెమిడి రచించిన 'ది ఎస్ కోడ్' పుస్తకాన్ని యూనివర్సిటీ సీఈఓ నీలిమ శనివారం ఆవిష్కరించారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ వక్త ఆకెళ్ల రాఘవేంద్ర పాల్గొని మొదటి ప్రతిని అందుకున్నారు. ఆంగ్ల విభాగాధిపతి డా.జీవీఎస్ అనంతలక్ష్మి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వక్తలు డా.విజయ్‌కుమార్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా.శ్రీనివాసరావు, అడ్మిషన్స్ డైరెక్టర్ డా.మద్ది శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సహజ యోగా సాధనతో ఆరోగ్యం



మేడిపల్లి: సహజయోగ ఆవిష్కర్త మాతాజీ నిర్మలాదేవి శతజయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సహజ యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మేడిపల్లిలోని యోగా కేంద్రంలో జాతీయ సహజ యోగా డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పలు రాష్ట్రాల నుంచి ఆయా రంగాల్లో పనిచేసే వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. సహజ యోగా సాధన ద్వారా అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సహజయోగా అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



మల్లాపూర్: తెలంగాణ ఎక్స్ సర్వీస్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాచారం హెచ్‌ఎంటీకాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఎక్స్ సర్వీస్‌మెన్స్ అసోసియేషన్ వారు దేశ రక్షణలోనే కాకుండా సమాజసేవ చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మామిడాల సంతోష్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, రవీందర్, శ్యామ్ సుందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, దేవ, హరిదాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి

తోటకూర వజ్రేష్‌యాదవ్



ప్రచారం ప్రారంభిస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్



దమ్మాయిగూడ పరిధి ఆర్‌జీకే కాలనీలో కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

జవహర్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే పేదల కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి గెలుపు కోసం ఇంటింటా తిరుగుతూ ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు నిహారికగౌడ్, మెట్టు ఆశాకుమారి, ప్రేమల శ్రీనివాస్, శ్రీకాంత్, సాయి, వేణు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, సదానంద్, రాజుయాదవ్, వినయ్ కుమార్, మెట్టు వెంకన్న, ప్రణీత్, మనోధర్‌రెడ్డి, అనంతలక్ష్మీ, వెంకటేశ్వర్లు, యాదగిరియాదవ్, మిట్టు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

కీసర: మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని టీపీసీసీ కార్యదర్శి గోగుల సరితా వెంకటేష్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో శనివారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కాంగ్రెస్ దమ్మాయిగూడ అధ్యక్షుడు ముప్పు రామరావు, కీసర మండల అధ్యక్షుడు కోళ్ల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, నాగారం అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నేతలు సంజీవరెడ్డి, ఈగ శ్వేత, జూపల్లి శోభారాణి, పోతరాజు రాములు, నర్మదపరశురాం, రాజు, మంచాల ప్రవీణ్‌కుమార్, ముద్దం వెంకట్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

శామీర్‌పేట: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా అంతాయిపల్లిలో లక్ష మందితో సీఎం సభ ఏర్పాటు చేస్తున్నామని, కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నియోజకర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధి అంతాయిపల్లిలో నిర్వహించనున్న సీఎం సభ స్థలి వద్ద ఏర్పాట్లను శనివారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిలతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీఎం సభకు లక్ష మందిని సమీకరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గత ప్రభుత్వం నీచంగా ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడిందని, వారు జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్